కోతులు, కుక్కల బెడదకు చెక్

- చౌటుప్పల్ మున్సిపాలిటీలో కోతులు, కుక్కల పట్టివేతకు చర్యలు
- కీసరకు చెందిన ప్రత్యేక బృందంతో ఒప్పందం
- ఒక్క కుక్కను పట్టినందుకు రూ.600, కోతికి రూ.500 చెల్లింపు
- మూడు రోజులుగా కుక్కలు పట్టే పనిలో నిమగ్నమైన బృందం
- హర్షం వ్యక్తం చేస్తున్న పట్టణవాసులు


కుక్కలను పట్టేందుకు వీధుల్లో తిరుగుతున్న ప్రత్యేక బృందం సభ్యులు


ఆటోలో తరలిస్తున్న కుక్కలు

చౌటుప్పల్ : చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలో గత కొన్ని సంవత్సరాలుగా కోతులు, కుక్కల బెడద తీవ్రంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ కేంద్రంతోపాటు విలీన గ్రామాలైన తంగడపల్లి, లింగోజిగూడెం, లక్కారం, తాళ్ల సింగారం, లింగారెడ్డిగూడెంలలో ఈ సమస్య మరీ దారుణంగా ఉంది. కోతులు, కుక్కల బెడదను అరికట్టాలని కోరుతూ గతంలో ఎన్నో సార్లు అధికారులను, ప్రజా ప్రతినిధులకు ప్రజలు విన్నవించిన ఫలితం లేకుండా పోయింది. అయితే ఇటీవల పట్టణంలోని పలు కాలనీ కమిటీలు, యువజన సంఘాల నాయకులు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని కలిసి విన్నవించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వెలువెత్తుతున్న నేపథ్యంలో ఈ సమస్యకు శాశ్వతంగా చెక్ పెట్టేందుకు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి చర్యలు చేపట్టారు. తక్షణమే చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. దీంతో పట్టణంలో కోతులు, కుక్కలను పట్టించేందుకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసరకు చెందిన ప్రత్యేక బృందాన్ని ఇక్కడికి పిలిపించారు. బుధవారం నుంచి ఆ బృందం కుక్కలను పట్టే పనిలో నిమగ్నమయ్యారు. కుక్కల పట్టివేత తరువాత కోతులను సైతం పట్టి అటవీ ప్రాంతాల్లో వదలనున్నారు.

కీసర నుంచి ప్రత్యేక బృందం..

మున్సిపాలిటీతో పాటు విలీన గ్రామాల్లో పూర్తిస్థాయిలో కోతులు, కుక్కలను పట్టేందుకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసరకు చెందిన ఇక్కడికి పిలిపించారు. పది మంది సభ్యులుగల ఆ బృందం బస చేసేందుకు 11వ వార్డులో ఉన్న మహిళా సంఘం భవనాన్ని కేటాయించారు. ఒక్క కుక్కను పట్టినందుకు రూ. 600లు, ఒక్క కోతిని పట్టినందుకు రూ.500లు చెల్లించేందుకు వారితో ఒప్పందం కుదుర్చుకున్నారు. పట్టిన కుక్కలను అదే రోజు తమ వాహనంలోనే నల్లమల అడవులకు తీసుకెళ్లి వదిలేయాల్సి ఉంటుంది. రవాణా ఖర్చులు సైతం మున్సిపాలిటీనే భరించనుంది. ఈ ఖర్చును మున్సిపల్ నిధులనుంచే చెల్లించాలని మున్సిపల్ పాలకవర్గం ఇటీవల తీర్మానం చేసింది.

నల్లమల అడవిలో విడిచిపెడుతాం



పట్టణంలో కుక్కలు పట్టేందుకు ప్రజలు సహకరించాలి. పట్టిన కుక్కలను నల్లమల అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి విడిచిపెడుతాం. ఒక్క కుక్కను పట్టుకునేందుకు చాలా సమయం పడుతుంది. ఎంతోసేపు శ్రమించాల్సి వస్తుంది. కుక్కలను పట్టడం పూర్తయ్యాక కోతులను పడుతాం. పెంపుడు కుక్కలను ఇళ్లలోనే కట్టేసుకోవాలి.

–అక్బర్‌భాయ్, కోతులు, కుక్కలు పట్టే బృందం లీడర్

ఇబ్బందులు పడుతున్నాం



వీధికుక్కలు, కోతులతో ఇబ్బందులు పడుతున్నాం. బయటికి వెళ్లాలంటే బయపడాల్సి వస్తుంది. మూగ జీవులైన మేకలు, కోళ్లను చంపుతున్నాయి. కుక్కలు, కోతులను పట్టించేందుకు చర్యలు చేపట్టినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నాం. శాశ్వతంగా ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నాం.

– మండలోజు సుభాష్‌చంద్రాచారి, విద్యానగర్‌కాలనీ అధ్యక్షుడు, చౌటుప్పల్

త్రిబుల్‌ఆర్ అలైన్‌మెంట్ మార్చాలని ధర్నా


ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

చౌటుప్పల్ : ఆర్‌ఆర్‌ఆర్ అలైన్‌మెంట్‌ను మార్చాలని, ఇటీవల మృతిచెందిన మండల పరిధిలోని మందోళ్లగూడెం గ్రామానికి చెందిన రైతు నర్సిరెడ్డి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ బాధిత రైతులు శుక్రవారం రైతు సంఘం ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాటూరి బాలరాజు, మేక అశోక్‌రెడ్డిలు మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న ఔటర్ రింగ్ రోడ్డుకు 60కిలోమీటర్ల దూరంలో రోడ్డును నిర్మించాలని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం చేసే విధంగా మంత్రితోపాటు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డిలు స్పందించాలని కోరారు. అనంతరం కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ సురేంద్రశర్మకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బూరుగు కృష్ణారెడ్డి, చీరిక సంజీవరెడ్డి, వెలగ నర్సిరెడ్డి, వల్లూరి బోగయ్య, మామిడి జంగారెడ్డి, లక్ష్మీనర్సు, బాలకృష్ణారెడ్డి, భూపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సుర్కంటి రాజిరెడ్డి పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో రైతులకు మేలు


ఆత్మకూరు(ఎం) : రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆలేరురూరల్ : భూసార పరీక్షలతో భూమి సారం తెలుస్తుందని, వాటి వివరాల ప్రకారం ఎరువులు వాడితే దిగుబడులు పెరుగుతాయని, తద్వారా రైతులకు మేలు జరుగుతుందని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త శంకర్ అన్నారు. విశ్వవిద్యాలయ సూక్ష్మ పోషక విభాగం ఆధ్వర్యంలో మండలంలో శారాజీపేట గ్రామంలో పది మంది షెడ్యూల్డ్ కులాల రైతులకు వంద శాతం సబ్సిడీపైన బ్యాటరీ స్ప్రేయర్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేల సారాన్ని తగ్గడానికి గల కారణాలను తెలిపారు. చవుడు నేలల పునరుద్ధరణ, సమస్యాత్మక భూముల యాజమాన్యం, వరి పంటల్లో పాటించాల్సిన సస్యరక్షణ చర్యలు గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఓ దీప్తి, ఏఈఓ నాగార్జున, శాలిని పవన్‌కళ్యాణ్, శివకుమార్, కిష్టయ్య, రాములు, నాగిరెడ్డి పాల్గొన్నారు.

జీవన ఎరువులపై రైతులకు అవగాహన

ఆత్మకూరు(ఎం): మండలంలోని పల్లెర్ల గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విద్యాలయం, ఏరువాక జిల్లా కేంద్ర, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు ఫాస్పరస్‌ను కరిగించు జీవన ఎరువు వినియోగంపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏరువాక శాస్త్రవేత్త మమత మాట్లాడుతూ వ్యవసాయ శాఖ అందించిన పీఎస్‌బీని వాడు విధానంలో మెలకువలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సోలిపురం మల్లారెడ్డి, ఏఈఓ సరిత తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పాఠశాల తనిఖీ

భువనగిరిక్రైం : మండలంలోని అనాజీపురం జెడ్పీ ఉన్నత పాఠశాలను డీఈఓ నారాయణ రెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థుల హాజరు శాతంపై ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు శ్రీకాంత్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఇద్దరు విద్యార్థులు గైర్హాజరవడంతో ఉండడంతో వారి తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలకు సక్రమంగా పంపించాలని కోరారు. చదువుతోనే ఉజ్వల భవిష్యత్ సాధించవచ్చొన్నారు. 100శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా కృషి చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఆయన వెంట ఎంఈఓ నాగవర్ధన్ రెడ్డి, ఉపాధ్యాయుడు రాజశేఖర్ ఉన్నారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

మోటకొండూర్: ప్రజా సమస్యలపై సీపీఎం నిరంతర పోరాటం చేస్తుందని పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కల్లూరి మల్లేశం అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఇంటింటికీ సీపీఎం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ సీపీఎం కార్యక్రమంతో ప్రజల వద్దకు వస్తున్న పార్టీకి తోచిన ఆర్థికంగా చేయూతను అందించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి బొలగాని జయరాములు గౌడ్, కొల్లూరి అంజనేయులు, కొమ్మగాని దశరథ, బోగ రమేష్, వంగపల్లి సాయిలు, బందెల పోషయ్య పాల్గొన్నారు.

ప్రాజెక్టులను కేఆర్‌ఎంబీకి అప్పగించడం దారుణం

సంస్థాన్ నారాయణపురం: కృష్ణా నది ప్రాజెక్టులను కేఆర్‌ఎంబీకి అప్పగించడం దారుణమని మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పుట్టపాక గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 13న నల్లగొండలో నిర్వహించనున్న బీఆర్‌ఎస్ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సభ ఇన్‌చార్జ్ శ్రీధర్, పాల్వాయి స్రవంతి, గడ్డం మురళీధర్‌రెడ్డి, వీరమళ్ల భానుమతి, వెంకటేశం, జక్కిడి జంగారెడ్డి, శివరాత్రి విద్యాసాగర్, దోనూరి జైపాల్‌రెడ్డి, మన్నే ఇంద్రసేనారెడ్డి, దేప విప్లవరెడ్డి, కత్తుల లక్ష్మయ్య, పాండురంగం తదితరులు పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్యశిబిరం

భువనగిరి : పట్టణంలోని శ్రీ గాయత్రి బాలికల జూనియర్ కళాశాలలో శుక్రవారం సంధ్య డెంటల్ క్లీనిక్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాటెండెంట్ సింగనబోయిన మల్లేశం మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం సుమారు 150 మంది విద్యార్థినులకు దంత వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సంధ్యరాణి, డాక్టర్ సుధీర్‌రెడ్డి, విజయ్, శిరిష, కర్తాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్కూల్ బ్యాగులు పంపిణీ

చౌటుప్పల్ : మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం గ్రామంలోని మోడల్ స్కూల్‌లో దివీస్ పరిశ్రమ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అదే విధంగా స్కూల్ బ్యాగులు, పాదరక్షలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దీప, దివీస్ ప్రతినిధులు వల్లూరి వెంకటరాజు, ఎస్.సాయి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అమ్మాయిలు అన్నిరంగాల్లో రాణించాలి

భువనగిరి: అమ్మాయిలు అన్నిరంగాల్లో రాణించాలని ఎస్‌ఎఫ్‌ఐ గర్ల్స్ కన్వీనర్ మక్కపల్లి పూజ, ఐద్వా జిల్లా కార్యదర్శి బట్టుపల్లి అనురాధ అన్నారు. శుక్రవారం పట్టణంలోని శ్రీ గాయత్రి బాలికల జూనియర్ కళాశాలలో ఎస్‌ఎఫ్‌ఐ మూడవ జిల్లా గర్ల్స్ కన్వెన్షన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్‌ఎఫ్‌ఐ గర్ల్స్ నాయకురాలు కుకుట్ల శివాని అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వనం రాజు, ఉపాధ్యక్షుడు లావుడియా రాజు, పట్టణ అధ్యక్షులు రాహుల్, సహనా, సరికొండ భవ్య, పూజ, పల్లవి, ప్రణతి, నర్మదా, నేహా, ఉదయ్, రమణ, సాయికుమార్ పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులను తనిఖీ చేయాలి

భువనగిరి రూరల్ : ఏడాది కాలంగా గ్రామాల్లో చేపట్టిన ఉపాధిహామీ పనులను క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయాలని ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులకు నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 10వ తేదీ నుంచి వారం రోజుల పాటు సామాజిక తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఆర్‌పీ చెన్నకేశవులు, ఏపీఓ బాలస్వామి, ఈసీ రాజశేఖర్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

రామన్నపేట : మండలంలోని ఇంద్రపాలనగరంలో అనారోగ్యంతో మృతిచెందిన గుంటోజు అంజయ్యచారి కుటుంబానికి జిల్లా కాంగ్రెస్ నాయకుడు పూస బాలకిషన్ శుక్రవారం రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పూస బాలనర్సింహ, గర్దాసు సురేష్, అంజయ్య, వెంకటేశం, వెంకటేష్, ప్రభాకర్ పాల్గొన్నారు.

విద్యార్థుల ఆత్మహత్యపై విచారణ పూర్తి చేయాలి


డీసీపీ రాజేష్ చంద్రకు వినతిపత్రం అందజేస్తున్న యాదవ విద్యావంతుల వేదిక నాయకులు

భువనగిరి క్రైం : విద్యార్థుల ఆత్మహత్య పై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ యాదవ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి ఆనంద్ యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం డీసీపీ రాజేష్‌చంద్ర, అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డికి వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మహత్యకు పాల్పడిన భవ్యశ్రీ, గాదె వైష్ణవిలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని అదే విధంగా విద్యార్థినుల కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ యాదవ సంఘం అధ్యక్షులు బాలయ్య, నాయకులు వేల్పుల యాదమల్లయ్య, వడిచర్ల కష్ణాయాదవ్, ఊదరి నర్సింహ యాదవ్, కడారి మల్లేశ్ యాదవ్, దేగెల అంజయ్య, మాదర బోయిన నరేష్, రాజు, లింగస్వామి, సాయికుమార్, వెంకటేశ్, రాసాల వినోద్, బీనబోయిన కుమార్ యాదవ్, మేకల బాలు, శంకర్ పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర


కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

భూదాన్‌పోచంపల్లి : జాతీయ ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకుడు కల్కూరి భిక్షపతి అన్నారు. శుక్రవారం మండలంలోని భీమనపల్లిలో ఉపాధిహామి కూలీల పనిప్రదేశాన్ని ఆయన సందర్శించారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంవత్సరానికి 200ల పనిదినాలను కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మంచాల మధు, బూరుగు భిక్షపతి, గూని మల్లేశ్, సునిత, పూలమ్మ, కమలమ్మ, మంజుల, హేమలత ాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం


మాట్లాడుతున్న తహసీల్దార్ శేషగిరి రావు

అడ్డగూడూరు : క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని వైస్ ఎంపీపీ దైద పురుషోత్తం , తహసీల్దార్ శేశగిరిరావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని డి.రేపాక గ్రామంలో 2014–15 ఎస్‌ఎస్‌సీ బ్యాచ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలను వైస్ ఎంపీపీ దైద పురుషోత్తం రెడ్డి, తహసీల్దార్ శేశగిరి రావు, ఎంపీడీఓ చంద్రమౌళిలు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నాగరాజు, యాదగిరి, మాజీ సర్పంచ్ కంచర్ల చలపతి రెడ్డి, కాంగ్రెస్ నాయకులు వెంకట్‌రెడ్డి, నర్సిరెడ్డి, పరుశురాములు, కొణతం శ్రీనివాస్ పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

రామన్నపేట : యువత క్రీడల్లో రాణించాలని తాజా మాజీ సర్పంచ్ ఎడ్ల మహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని వెల్లంకి గ్రామంలోని క్రీడాకారులకు దుస్తులు, షూ, క్రికెట్ బ్యాట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎడ్ల నరేందర్‌రెడ్డి, గంట కర్ణాకర్‌రెడ్డి, భాస్కర్, కాశీరాం పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ క్రీడోత్సవాలు

ఆత్మకూరు(ఎం): మండల కేంద్రంలో నేతాజీ యువజన మండలి ఆధ్వర్యంలో ప్రతికంతం వెంకటరామనరసరాజు–మాణిక్యమ్మ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన క్రికెట్ క్రీడోత్సవాలు శుక్రవారం ముగిశాయి. విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ యాస కవిత, మాజీ ఎంపీపీ హేమలత, మాజీ జెడ్పీటీసీ పూర్ణచందర్‌రాజు, మాజీ సర్పంచ్‌లు జన్నాయికోడె నగేష్, బీసు చందర్ గౌడ్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

మాజీ పంచాయతీ పాలకవర్గానికి సన్మానం

మోత్కూరు : మండలంలోని దాచారం గ్రామ పంచాయతీ పాలక వర్గ సభ్యులను శుక్రవారం పలువురు సన్మానించారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ అండెం రజితారాజిరెడ్డి, ఎంపీడీఓ, గ్రామ ప్రత్యేక అధికారి పోరెడ్డి మనోహర్‌రెడ్డి , కార్యదర్శి మిర్యాల శృతి తదితరులు పాల్గొన్నారు.

బొమ్మలరామారం : ఇటీవల పదవీ కాలం ముగిసిన సర్పంచ్‌లను శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చిమ్ముల సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీఓ సరిత, మచ్చ శ్రీనివాస్ గౌడ్, వైస్ ఎంపీపీ శోభ చంద్రమౌళి, ఎంపీటీసీలు ఏర్వ హేమంత్ రెడ్డి, కుర్మిండ్ల ఈశ్వర్ గౌడ్, రాజేందర్ రెడ్డి, ఈదమ్మ, శ్రీహరి నాయక్, నర్సింహులు, గూదె బాలనర్సింహ పాల్గొన్నారు.

కురుమ సంఘం అధ్యక్షుడిగా శ్రీశైలం

ఆలేరురూరల్ : పట్టణ కేంద్రంలో కురమ సంఘం నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా ఎగ్గిడి శ్రీశైలం ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో మోహన్, వెంకటేష్ ఉన్నారు.

సాక్షర భారత్ కో ఆర్డినేటర్లను విధుల్లోకి తీసుకోవాలని వినతి

వలిగొండ : సాక్షర భారత్ కో ఆర్డినేటర్లను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ పలువురు శుక్రవారం మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డిని హైదరాబాద్ లోని ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సాక్షర భారత్ గ్రామ కోఆర్డినేటర్ల సంఘం మండల అధ్యక్షుడు బుగ్గ బీరప్ప , గ్రామ కోఆర్డినేటర్లు పోలేపల్లి బాల నరసింహ, మల్లం ధనమ్మ, రొయ్యల రజిత , ధనలక్ష్మి ,మాధవి, సుజాత, చైతన్య, స్వరూప పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

సంస్థాన్ నారాయణపురం: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 30మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణ లక్ష్మి చెక్కులను శుక్రవారం ఎంపీపీ గుత్త ఉమాదేవి అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణ, ఎంపీడీఓ రాములు, ఎంపీటీసీ గాలయ్య, వసంత, రాములమ్మ పాల్గొన్నారు.

గ్యాస్ ఏజెన్సీల అక్రమ వసూళ్లను అరికట్టాలి

మోత్కూరు : గ్యాస్ ఏజెన్సీలు హోం డెలివరీ పేరిట ఒక్కో గ్యాస్ సిలిండర్‌పై రూ.50 చొప్పున అదనంగా వసూలు చేస్తున్నారని బీజేపీ మండల శాఖ ఉపాధ్యక్షుడు గూదె మధుసూదన్ ఆరోపించారు. శుక్రవారం మండలంలోని పాలడుగు గ్రామంలో డెలివరీ చార్జీలను వసూలు చేస్తుండడంపై గ్యాస్ డెలవరీ బాయ్‌ను నిలదీశారు. అదనంగా వసూలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యార్థినికి అభినందన

భువనగిరి : ఇటివల నిర్వహించిన రాష్ట్ర స్థాయి సైన్స్ సెమినార్‌లో మొదటి బహుమతి సాధించిన పట్టణంలోని మదర్ థెరిస్సా హైస్కూల్‌కు చెందిన విద్యార్థి శ్రేయను శుక్రవారం పలువురు అభినందించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో షీల్డ్ అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ సురేష్ పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి జెడ్పీ చైర్మన్ చేసిందేమీ లేదు

బొమ్మలరామారం : మండల అభివృద్ధికి జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి చేసిందేమి లేదని కాంగ్రెస్ జిల్లా నాయకుడు, రామలింగంపల్లి ఎంపీటీసీ ఏర్వ హేమంత్ రెడ్డి విమర్శించారు. శుక్రవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లా డారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు ఫక్కీరు రాజేందర్ రెడ్డి, శ్రీహరి నాయక్, ఈదమ్మ, యంజాళ కళ,రాంపల్లి మహేష్ గౌడ్, భిట్టు శ్రీనివాస్, పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి


వలిగొండ : వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న భవన నిర్మాణ కార్మికులు

చౌటుప్పల్ : ఈనెల 16న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న సమ్మెను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ. జహంగీర్ అన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలన్నారు. ఈ సమావేశంలో మాటూరి బాలరాజు, గంగదేవి సైదులు, బూరుగు కృష్ణారెడ్డి, వెంకటేష్, సంజీవరెడ్డి, బాలయ్య, మధుకృష్ణ, కొండె శ్రీశైలం, యాదయ్య, నందీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

వలిగొండ : ఈ నెల 16న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు సింగారం వెంకటేష్ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో భవన నిర్మాణ కార్మికులతో కలిసి సమ్మె పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాదారపు మల్లేశం, పోలేపాక శంకర్, రేగు బీరప్ప, భాస్కర్, దేవరాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

తుర్కపల్లి: ఈ నెల 16న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు పోతరాజు జహంగీర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పెద్దమ్మగుడి వద్ద నిర్వహించిన సీఐటీయూ మండల జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో లింగయ్య, నర్సింహులు, రాజు, సంతోష్‌గౌడ్, శ్రీశైలం, శ్రీనివాస్, నరేశ్, మనీ హుస్సేన్, బాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం


రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

భువనగిరి: ప్రధాని మోదీ పుట్టుకతో ఓబీసీ సామాజిక వర్గానికి చెందినవారు కాదని జోడో యాత్రలో కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ అనడంపై నిరసన వ్యక్తం చేస్తూ బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం రాహుల్ గాంధీ చిత్ర పటాన్ని దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ మాట్లాడుతూ మోదీ ఓబీసీ కాదని అనడం రాహుల్‌గాంధీ అవివేకానికి నిదర్శనమన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ కులాన్ని 2000 సంవత్సరంలోనే ఓబీసీ జాబితాలో చేర్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దుర్గాపతి లక్ష్మీనారాయణ, రాష్ట్ర నాయకులు రత్నపుం శ్రీశైలం,తుమ్మల నాగేష్, మల్లీకార్జున్, చిక్కా కృష్ణ, మున్సిపల్‌ఫ్లోలీడర్ మాయ దశరథ, కౌన్సిలర్లు రత్నపురం బలరాం, విజయకుమార్, జనగాం నర్సింహా చారి, నల్లమాస వెంకటేశ్వర్లు, ఉడుత భాస్కర్, పట్నం కపిల్,సంతోష వినోద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

మోత్కూరు : విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొల్లు యాదగిరి డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో కస్తూరిబా పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నెలకొన్న సమస్యలను విద్యార్థులను, ప్రత్యేక అధికారి యాదమ్మను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు, బుర్రు అనిల్‌కుమార్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

మోత్కూరు : ప్రభుత్వ ఎస్సీ, బీసీ, ఎస్టీ బాలుర, బాలికల సంక్షేమ వసతి గృహాలో మౌలిక వసతులు కల్పించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పల శాంతికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మోత్కూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఎస్సీ సంక్షేమ బాలుర వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ మండల నాయకులు కందుకూరి దినేష్, వినయ్ పాల్గొన్నారు.

దరఖాస్తుల పరిశీలన త్వరితగతిన పూర్తిచేయాలి

గుండాల : ఉమ్మడి వరంగల్– నల్లగొండ– ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం పట్టభద్రులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న దరఖాస్తులను త్వరిత గతిన పరిశీలించి ఆమోదించాలని ఆర్డీఓ పి.అమరేందర్ అన్నారు. శుక్రవారం మండల తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పరిశీలించి దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ జలకుమారి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఎంఆర్ వెంకటేశ్వర్లు, ఏఆర్ఐ నరేష్ పలువురు రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి

ఆలేరు రూరల్ : విద్యార్థులు ప్రారంభ దశలోనే ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని ముందుకు సాగాలని ఉపాధి కల్పన శాఖ శిక్షణ జిల్లా అధికారి కమల్‌దీప్ పేర్కొన్నారు. శుక్రవారం ఆలేరులోని మైనార్టీ గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టంతో చదవాలన్నారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనర్ రాజశేఖర్, అధికారి మనీ షా, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా మాత్రల పంపిణీ

రామన్నపేట : జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా నిర్వహించనున్న నులిపురుగుల నివారణ మాత్రలు పకడ్బందీగా పంపిణీ చేయాలని తహసీల్దార్ సి.లాల్‌బహదూర్, వైద్యాధికారి డాక్టర్ అశ్వినికుమార్ అన్నారు. శుక్రవారం మునిపంపుల పీహెచ్‌సీలో మాత్రల పంపిణీపై సన్నాహ క సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ చంద్రకళ, హెచ్‌ఈఓ గోపాల్, పీహెచ్‌ఎన్ అండమ్మ, వాణిశ్రీ, మల్లేష్ పాల్గొన్నారు.

సోమ్లానాయక్‌కు సన్మానం


సన్మానిస్తున్న కిరణ్ కుమార్ రెడ్డి

భువనగిరి రూరల్ : పద్మశ్రీ అవార్డుకు ఎంపికైన సోమ్లానాయక్‌ను శుక్రవారం టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సిటిజన్ యాప్‌పై అవగాహన

భువనగిరిటౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో శుక్రవారం భువనగిరి సిటిజన్ బడ్డి యాప్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ బట్టు నాగిరెడ్డి మాట్లాడుతూ సెప్టిక్ ట్యాంకులను శుభ్రపరచడానికి సంబంధించిన లింకును ఈ యాప్ ద్వారా అందుబాటులోకి తేవడం జరిగిందన్నారు. యాప్‌ను ప్రజలందరూ తమ సెల్ ఫోన్లలో డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. యాప్‌లో సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నల్లమాసు సుమా వెంకటేష్, ట్రైనర్స్ ఓం ప్రకాష్, అవినాష్ పాల్గొన్నారు.

18న జిల్లా కమిటీ సమావేశం

ఆత్మకూరు(ఎం): ఈ నెల 18న మండల కేంద్రంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా కమిటీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి దొడ్డి స్వామి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో సమావేశానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పట్ల టీఎస్ యూటీఎఫ్ ముందుండి పోరాడుతుందన్నారు. జిల్లా కమిటిటీ విస్తృత స్థాయి సమావేశానికి ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక కమిటీ జిల్లా కన్వీనర్ కట్టా రమేష్, ప్రధాన కార్యదర్శులు దర్శనం వెంకన్న, జూకంటి కరుణాకర్, సోమయ్య, ఉపాధ్యాయులు నర్స య్య, గడ్డమీది శ్రీను, జోరుక మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రిలోనే మెడికల్ కళాశాల ఏర్పాటు చేయాలి

తుర్కపల్లి: యాదాద్రిలోనే మెడికల్ కళాశాల ఏర్పాటు చేయాలని బీఆర్‌ఎస్ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భానోత్ భాస్కర్‌నాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యాదగిరిగుట్టకు మెడికల్ కాలేజి మంజూరైతే దానిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన నియోజవర్గానికి తరలించుకుపోవడంతో యాదాద్రి జిల్లాకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గ సోషల్ మీడియా కన్వీనర్ శ్రీకాంత్, దత్తాయపల్లి ఎంపీటీసీ కరుణాకర్, సర్పంచ్ సత్యనారాయణ పాల్గొన్నారు.

గృహజ్యోతి సర్వే

ఆత్మకూరు(ఎం): మండలంలోని పలు గ్రామాల్లో కొనసాగుతున్న గృహజ్యోతి సర్వే, ఆధార్ అనుసంధానం ప్రక్రియను శుక్రవారం ట్రాన్స్‌కో సీజీఎం భిక్షపతి, ఎస్సీ శ్రీనాథ్, డీఈ మల్లిఖార్జున్ పరిశీలించారు. మండలంలో ఇప్పటి వరకు 4600ఇళ్లకు సర్వే పూర్తి చేశామన్నారు. వారి వెంట ఏఈ ప్రభాకరరెడ్డితో పాటు విద్యుత్ సిబ్బంది ఉన్నారు.

బొమ్మలరామారం : మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ అధికారులు శుక్రవారం గృహజ్యోతి ఇంటింటి సర్వే నిర్వహించారు. సర్వేను ఇన్‌చార్జ్ ఏఈ సదయ్య పరిశీలించారు.

కేంద్ర పథకాలను వివరించాలి

వలిగొండ : కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని బీజేపీ నాయకుడు బందారపు లింగస్వామిఅన్నారు. మండలంలోని కెర్చుపెల్లి, వర్కట్ పల్లి గ్రామాల్లో గావ్ చలో.. ఘర్ చలో కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాగెల్లి సుధాకర్, కనతాల అశోక్ రెడ్డి, కొప్పుల యాదిరెడ్డి, కుమారస్వామి, ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస చారి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ పాలనలో అన్నిరంగాలు అభివృద్ధి

రామన్నపేట : మోదీ పాలనలో అన్నిరంగాలు అభివృద్ధి చెందాయని బీజేపీ ఓబీసీమోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు పల్లపు దుర్గయ్య అన్నారు. శుక్రవారం మునిపంపుల గ్రామంలో గావ్ చలో అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీసర్పంచ్ కట్ట యాదయ్య, మేకల మల్లారెడ్డి, చొల్లేటి ప్రభాకరాచారి, తెలకలపల్లి పెద్ద భిక్షం, రావుల నవీన్, ఆదొడ పెద్ద నర్సింహ, కె.యాదయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాలుడి ఆచూకీ కోసం గాలింపు

భువనగిరి క్రైం : పట్టణంలోని బస్టాండ్ ఎదురుగా ఈనెల 5న తప్పిపోయిన ఆరు సంవత్సరాల సిద్ధిరాములు ఆచూకీ కోసం పోలీసులు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. నిజామాబాద్ జిల్లా రాతాల రాంరెడ్డి గ్రామానికి చెందిన బైండ్ల చిన్నరాజు కుమారుడు సిద్ధిరాముడు ఈ నెల 5న ఉదయం బస్టాండ్ సమీపంలో తప్పిపోగా కుటుంబంతో సహా బస్టాండ్ ఎదురుగా ఉంటున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా ప్రధాన రహదారిపై ఉన్న దుకాణాలు తదితర ప్రాంతాల్లో సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నారు.

11న జూనియర్ కబడ్డీ సెలక్షన్స్

ఆలేరురూరల్ : సబ్ జూనియర్ బాలబాలికల కబడ్డీ జిల్లా సెలక్షన్ పోటీలను ఈ నెల 11న ఆలేరు పట్టణంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కబడ్డీ ప్రధాన కార్యదర్శి పూల నగయ్య ఒక ప్రకటనలో తెలిపారు. సెలక్షన్ పోటీల్లో పాల్గొనే ఆసక్తి క్రీడాకారులు ఆదివారం పాఠశాల మైదానంలో హాజరు కాగలరన్నారు. సెలక్ట్ అయిన క్రీడాకారులు ఈనెల 16 నుంచి 19 వరకు సూర్యాపేట జిల్లాలోని చింతలపాలెం గ్రామంలో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

మునగాల(కోదాడ): ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందాడు. మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన ముస్కుల వీరశేఖర్(40) నడిగూడెం ఎంపీడీఓ కార్యాలయంలో అటెండర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. కాగా, వీరశేఖర్ వివిధ చిట్‌ఫండ్ సంస్థల్లో అప్పులు తీసుకొని తిరిగి కట్టలేక మనస్తాపానికి గురై గత నెల 27రాత్రి పురుగుల మందు తగాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు ఖమ్మం పట్టణంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లోకేష్ తెలిపారు.

అదుపుతప్పి లారీ బోల్తా

మాడుగులపల్లి : లారీ అదుపుతప్పి బోల్తాపడిన ఘటన మండల కేంద్రంలోని టోల్‌గేట్ సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర నుంచి ఉల్లిగడ్డల లోడ్ లారీ ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరుకు బయల్దేరింది. మాడుగులపల్లి టోల్‌ప్లాజా దాటగానే అదుపుతప్పి రోడ్డు దిగువకు దూసుకెళ్లి పల్టీకొట్టింది. ప్రమాదం నుంచి డ్రైవర్, క్లీనర్ సురక్షితంగా బయటపడ్డారు. డ్రైవర్ నిద్రమత్తే ప్రమాదానికి కారణమని సమాచారం. ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

అనాథాశ్రమంలో వృద్ధురాలి అప్పగింత



వృద్ధురాలిని స్థానికుల సాయంతో అనాథాశ్రమానికి తీసుకెళ్తున్న నవీన్ ఠాగూర్

యాదగిరిగుట్ట : నడవలేని స్థితిలో ఉన్న ఓ వృద్ధురాలిని నవీన్ ఠాగూర్ అనే యువకుడు భువనగిరి మండలం రాయగిరిలో ఉన్న అనాథాశ్రమంలో చేర్పించాడు. హైదరాబాద్‌లోని ఉప్పల్ గూడకు చెందిన ఆశ అనే వృద్ధురాలు ఆరేళ్ల క్రితం యాదగిరిగుట్టకు వచ్చింది. ఇక్కడే భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తోంది. భిక్షాటన చేస్తున్న క్రమంలో గుర్తు తెలియని వాహనం ఆమెను ఢీకొట్టడంతో గాయపడి నడవలేని స్థితిలో ఉంది. స్థానిక తులసీ కాటేజీ సమీపంలో ఉన్న వృద్ధురాలిని నవీన్ ఠాగూర్ గమనించి చేరదీశాడు. స్నేహితుల సహాయంతో ఆమెను రాయగిరిలోని అనాథాశ్రమంలో చేర్పించారు. వృద్ధురాలి వద్ద కొంత నగదు ఉండగా ఆశ్రమ నిర్వాహకులకు అందజేశారు. బాధితురాలి కుటుంబీకులు వస్తే అప్పగించాలని కోరారు.

మట్టపల్లిలో నిత్య కైంకర్యాలు

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శుక్రవారం నిత్యకైంకర్యాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిత్యహోమం జరిపారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సం చేపట్టారు. ఆ తర్వాత విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్క పూజ, మాంగళ్యధారణ, తలంబ్రాలతో శ్రీరాజ్యలక్ష్మి, చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. అనంతరం క్షేత్రపాలకుడైన ఆంజనేయస్వామికి తమలపాకులతో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈట నవీన్‌కుమార్, అర్చకులు అద్దేపల్లిలక్ష్మణాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి పాల్గొన్నారు.

అర్హత ఉన్నా అనర్హులుగానే..!

- వైద్య శాఖలో ఎంఎల్‌హెచ్‌పీ పోస్టులకు 'బ్రిడ్జి కోర్సు' నిబంధన
- 2020 తరువాత బ్రిడ్జి కోర్సును సబ్జెక్టుగా చేర్చిన వైనం
- అంతకుముందు బీఎస్సీ నర్సింగ్, జీఎన్‌ఎం పూర్తిచేసిన వారి పరిస్థితి అగమ్య గోచరం



మిర్యాలగూడ అర్బన్: 2020 కంటే ముందు బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం పూర్తి చేసిన అభ్యర్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఎన్నో ఆశలతో ఆ కోర్సులు చేసిన వారు.. వైద్య శాఖాధికారుల నిర్ణయంతో గందరగోళంలో పడిపోయారు. వైద్య శాఖలో ఇటీవల ఎంఎల్‌హెచ్‌పి (మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్) ఉద్యోగాల కోసం ఆయా జిల్లా వైద్యాధికారులు భర్తీ చేసేవిధంగా ఉత్తర్వులు ఇచ్చారు. దానిలో భాగంగా బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం పూర్తి చేసిన వారు మరో ఆరు నెలల బ్రిడ్జి కోర్సు కూడా పూర్తి చేసి ఉండాలని నిబంధన విధించారు. దీంతో అసలు అప్పటి వరకు బ్రిడ్జి కోర్సు అంటే తెలియని వీరు ఆందోళనలోపడ్డారు. ఇప్పుడు కేవలం రెగ్యులర్ అభ్యర్థులకే బ్రిడ్జి కోర్సు అందుబాటులో ఉంది. గతంలో నర్సింగ్, జీఎన్ఎం పూర్తిచేసిన వారికి బ్రిడ్జి కోర్సు చేసే అవకాశం లేదు. దీంతో వారు ఎంఎల్‌హెచ్‌పి ఉద్యోగాలకు దూరం కావాల్సి వస్తోంది. 2020 తరువాత బ్రిడ్జి కోర్సును బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎంలలో ఒక సబ్జెక్టుగా చేర్చారు. దీంతో 2020 తరువాత ఆ కోర్సులు చేసిన వారికి ఎలాంటి ఇబ్బందీ లేదు. కానీ, అంతకంటే ముందు ఆ కోర్సులు పూర్తి చేసిన వారికి ఎలాంటి ప్రత్యామ్నాయం చూపాలనే.. ముందు చూపు వైద్యశాఖాధికారులకు లేకపోవడం శోచనీయం. ఈ కొత్త నిబంధనలతో ఎంఎల్‌హెచ్‌పి పోస్టులు సైతం పూర్తిగా నింపలేని పరిస్థితి ఏర్పడగా ఇప్పటికి అనేక పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిసింది. ఏ ప్రభుత్వ ఉద్యోగాలకు బ్రిడ్జికోర్సు పెట్టని నిబంధన కేవలం ఎంఎల్‌హెచ్‌పి పోస్టులకు మాత్రమే ఎందుకు పెట్టారని పలువురు ప్రశ్నిస్తున్నారు. బ్రిడ్జి కోర్సుతో సంబంధం లేకుండా తమకు కూడా ఎంఎల్‌హెచ్‌పి ఉద్యోగాలకు అవకాశం కల్పించాలని, లేకుంటే 2020 కంటే ముందు బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం పూర్తి చేసిన అభ్యర్థులందరికి బ్రిడ్జి కోర్సును నిర్వహించి ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని అభ్యర్థులు కోరుతున్నారు.

ప్రభుత్వ నిబంధనల ప్రకారమే భర్తీ చేస్తాం

ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ఎంఎల్‌హెచ్‌పి పోస్టులకు బ్రిడ్జి కోర్సు ఉన్న వారినే ఎంపిక చేశాం. 2020 తరువాత బీఎస్సి, జీఎన్ఎం పూర్తి చేసిన వారికి సబ్జెక్టుగా బ్రిడ్జి కోర్సును చేర్చారు. అయితే అంతకు ముందు కోర్సులు పూర్తి చేసినవారు మిగతా పోస్టులకు అర్హులే. ఈ ఒక్క పోస్టుకు మాత్రమే ఈ నిబంధన ఉంది.

– అనిమళ్ల కొండల్‌రావు, డీఎంహెచ్‌ఓ, నల్లగొండ

మహిళలకు సమాన అవకాశాలు కల్పించాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ పూజ



మాట్లాడుతున్న రాష్ట్ర కన్వీనర్ పూజ

భువనగిరిటౌన్ : మహిళలకు సమాన అవకాశాలు కల్పించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మక్కపల్లి పూజ, ఐద్వా జిల్లా కార్యదర్శి బట్టుపల్లి అనురాధ అన్నారు. భువనగిరి జిల్లా కేంద్రంలో ఎస్ఎఫ్ఐ జిల్లా గరల్స్ కన్వెన్షన్‌ను శ్రీ గాయత్రి జూనియర్ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మాయిల బాల్య వివాల వల్ల దోపిడీ, హింసకు లైంగిక వేధింపులకు గురయ్యే అవకాశాలు ఉన్నాయని అన్నారు. సమాజంలో లింగ వివక్షత కోసం ప్రతి ఒక్కరూ పోరాడాలని పిలుపునిచ్చారు. లింగ సమానత్వంపై ఐక్యంగా విద్యార్థి లోకమంతా పనిచేయాలన్నారు. అమ్మాయిలు ధైర్యంగా ఉండి వారి లక్ష్యాలను సాధించే దిశగా ప్రయాణం చేయాలని అన్నారు. కార్యక్రమంలో నాయకురాలు కుకూట్ల శివాని,కొలుపుల సహనా, సిరికొండ భవ్య, చేగురి పూజ, అప్పం పల్లవి, జంపాల ప్రణతి, నర్మదా, గుగ్గిళ్ళ నేహా, ఆకుల కావ్య ఎస్ఎఫ్ఐ పట్టణ నాయకులు బుగ్గ ఉదయ్, రాయోజు రమణ, ఎంబాడీ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కూలీకి గాయాలు

మునుగోడు: ట్రాక్టర్ చక్రం కాలు పైనుంచి వెళ్లడంతో ఉపాధిహామీ కూలీకి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని పలివెల గ్రామంలో చోటు చేసుకుంది. మునుగోడు మండలంలోని పలివెల గ్రామానికి చెందిన ఉపాధిహామీ కూలీ జయమ్మ రోజువారీగా శుక్రవారం తమ గ్రామంలోని చెరువులో జరుగుతున్న పూడిక తీత కూలీ పనులకు వెళ్లింది. చెరువులో తవ్విన మట్టిని ట్రాక్టర్‌లో లోడు చేయగా అది దిగబడడంతో కూలీలు అంతా కలిసి నెట్టుతున్నారు. ఈ క్రమంలో ఒక్కసారిగా ట్రాక్టర్ ముందుకు కదలడంతో జయమ్మ కాలుపై నుంచి వెళ్లింది. దీంతో కాలు విరిగిపోవడంతో తోటి కూలీలు చికిత్స నిమిత్తం మునుగోడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

జడ్పీటీసీ నల్లపాటి ప్రమీలపై అనర్హత వేటు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరాములు

- హుజూర్‌నగర్ కోర్టు తీర్పు ఇచ్చిందని వెల్లడించిన సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బుర్రి శ్రీరాములు

మునగాల: మునగాల మండల జడ్పీటీసీ సభ్యురాలుగా కొనసాగుతున్న నల్లపాటి ప్రమీలను అనర్హురాలిగా ప్రకటిస్తూ హుజూర్‌నగర్ సెషన్స్ కోర్టు తీర్పు వెల్లడించిందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బుర్రి శ్రీరాములు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2019లో మునగాల జెడ్పీటీసీ స్థానానికి టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా నల్లపాటి ప్రమీల పోటీ చేసి గెలుపొందారని తెలిపారు. అదే ఎన్నికల్లో పోటీ చేసిన అఖిలపక్షాల ఉమ్మడి అభ్యర్థి దేశిరెడ్డి జ్యోతి ఓటమి పాలయ్యారని పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాలు విడుదలైన తర్వాత నల్లపాటి ప్రమీల ఎన్నికను సవాల్ చేస్తూ జ్యోతి కోర్టును ఆశ్రయించిందని తెలిపారు. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం1995తర్వాత ఇద్దరి కన్న ఎక్కువ మంది సంతానం కలిగి ఉన్నారని, నల్లపాటి ప్రమీల పోటీకి అనర్హురాలని కోర్టుకు వివరించిందని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా తప్పుడు నామినేషన్ దాఖలు చేసి ఎన్నికైన ప్రమీలను తొలగించాలని , ఆమెకు వాస్తవంగా ముగ్గురు సంతానం ఉన్నారని కోర్టులో పిటీషన్ దాఖలు చేశారని తెలిపారు. కేసును స్వీకరించిన డివిజనల్ మెజిస్ట్రేట్ విచారణ చేపట్టి తీర్పు వెల్లడించారని, విచారణ పూర్తయ్యాక అన్ని రకాల ఆధారాలను కోర్టులో జ్యోతి సమర్పించడంతో ఈ కేసులో జెడ్పీటీసీ ఎన్నికల ఫలితాల్లో రెండవ స్థానంలో ఉన్న జ్యోతిని జెడ్పీటీసీ సభ్యురాలిగా కొనసాగాలని కోర్టు తీర్పు వెల్లడించిందని శ్రీరాములు తెలిపారు. దీంతో సీపీఎం పార్టీ శ్రేణులు స్వీట్లు పంపిణీ చేశారు. సమావేశంలో సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, పార్టీ మండల కార్యదర్శి చందా చంద్రయ్య మండల కార్యదర్శి వర్గ సభ్యులు బచ్చలకూరి స్వరాజ్యం పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు ప్రారంభం

- పోటీలను ప్రారంభించిన డీఈఓ నారాయణరెడ్డి, ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి
- విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని పిలుపు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు



క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న డీఈఓ నారాయణరెడ్డి, తదితరులు



ఖోఖో పోటీల్లో తలపడుతున్న వరంగల్, నిజామాబాద్ జట్ల క్రీడాకారులు

భువనగిరి : తెలంగాణ రాష్ట్ర స్థాయి సీనియర్ ఖోఖో ఛాంపియన్ షిప్ (2023–24) పోటీలు శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో ప్రారంభమయ్యాయి. భువనగిరి పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఆవరణలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న పోటీలను డీఈఓ నారాయణరెడ్డి, తెలంగాణ ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు నిర్వహించుకోవడం సంతోషకరమన్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు అభ్యసన ప్రక్రియతో పాటు క్రీడాకారులుగా తీర్చిదిద్దాలన్నారు. గ్రామీణప్రాంతాల్లోని క్రీడాకారులను వ్యాయామ ఉపాధ్యాయులు ప్రోత్సహించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా కృషి చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే మొదటి సారిగా భువనగిరి మ్యాట్ పై ఖోఖో పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీసి జాతీయ స్థాయిలో రాణించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అంతకు ముందు వివిధ ఉమ్మడి జిల్లాల ఖోఖో క్రీడాకారులు మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. మొదటి రోజు పది ఉమ్మడి జిల్లాలకు చెందిన ఖోఖో జట్ల మధ్య లీగ్ మ్యాచ్‌లను నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ నరాల నిర్మల, జెడ్పీటీసీ బీరు మల్లయ్య, జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి ధనుంజయనేయులు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి స్టాలిన్‌బాబు, ఉమ్మడి నల్లగొండ జిల్లా ఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాతి కృష్ణమూర్తి, వివిధ ఉమ్మడి జిల్లాల ఖోఖో అసోసియేషన్ అధ్యక్ష,కార్యదర్శులు, పీఈటీలు, పీడీలు తదితరులు పాల్గొన్నారు.

పిల్లల కిడ్నాపర్లంటూ ప్రచారం

- కారులో వచ్చిన పలువురు దుండగులు
- చిక్కకుండా తప్పించుకున్న ముఠా

చౌటుప్పల్ : చౌటుప్పల్ మండలంలోని పలు గ్రామాల్లో పిల్లలను కిడ్నాప్ చేసే ముఠా సంచరిస్తుందన్న అంశం శుక్రవారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. మహీంద్రా జైలో వాహనంలో వచ్చిన కొంత మంది వ్యక్తులు మండల పరిధిలోని జైకేసారం గ్రామ శివారులో సంచరించారు. పరిసర ప్రాంతాలకు చెందిన గ్రామస్తులు, రైతులు వారిని గమనించారు. అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో ఇతరులకు సమాచారం చేరవేశారు. ఆ క్రమంలో కొంత మంది అక్కడకు చేరుకున్నారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న వాహనం, అందులోని వ్యక్తుల గురించి తెలుసుకునేందుకు దగ్గరకు వెళ్లే ప్రయత్నం చేశారు. గ్రామస్తులను గమనించిన అనుమానాస్పద వ్యక్తులు వాహనాన్ని స్టార్ట్ చేసుకొని అక్కడి నుండి వేగంగా ఉడాయించారు. అంతే వేగంతో చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని వలిగొండ రోడ్డులోకి శుక్రవారం సాయంత్రం వేళలో ప్రవేశించారు. జైకేసారం నుంచి అందిన సమాచారం మేరకు ఇక్కడి యువకులు కొందరు వాహనాన్ని వెంబడించారు. పట్టుకునేందుకు ప్రయత్నించారు. అయితే హైవేపైకి వెళ్తే దొరికిపోతామన్న ఆలోచనతో యువకులకు చిక్కకుండా సందుల్లో, గొందుల్లో నుంచి వాహనాన్ని తిప్పి చాకచక్యంగా తప్పించుకొని పారిపోయారు. జైలో వాహనానికి ఉన్న నెంబర్ కూడా సరిగా కనిపించకుండా ఉంది. అయితే ఈ వాహనం, అందులోని వ్యక్తులు చిన్నపిల్లలను కిడ్నాప్ చేసే వ్యక్తులు కాదని, మేకలను ఎత్తుకెళ్లే ముఠాగా తేలింది.

వ్యక్తిపై కేసు నమోదు

చౌటుప్పల్ : జాతీయ రహదారిపై వెళ్తున్న వాహనాల వద్ద తక్కువ ధరకు డీజిల్‌ను కొనుగోలు చేసి స్థానికంగా ట్రాక్టర్ యజమానులకు అధిక ధరకు విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేశామని సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు. చౌటుప్పల్ మండల పరిధిలోని రెడ్డిబావి గ్రామానికి చెందిన నందగిరి మహేష్ అదే గ్రామం వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులకు గురువారం అనుమానాస్పదంగా తిరుగుతున్నాడు. అప్పటికే అతని వద్ద నాలుగు డీజిల్ క్యాన్లలో 80లీటర్ల డీజిల్ ఉంది. ఈ విషయమై విచారించగా హైవేపై రాకపోకలు సాగించే వాహనాల వద్ద తక్కువ ధరకు డీజిల్‌ను కొనుగోలు చేసి స్థానికంగా ఉన్న ట్రాక్టర్ యజమానులకు అధిక ధరకు అమ్ముతున్నట్టుగా అతను అంగీకరించాడు. ఈ మేరకు కేసు శుక్రవారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

మెడికల్ కళాశాలను తరలిస్తే ఊరుకోం



రాస్తారోకో చేస్తున్న బీజేవైఎం నాయకులు

భువనగిరి : యాదగిరి గుట్టకు మంజూరైన మెడికల్ కళాశాలను మరో ప్రాంతానికి తరలిస్తే ఊరుకోమని బీజేవైఎం జోనల్ ఇంచార్జి పట్నం కపిల్ అన్నారు. శుక్రవారం మెడికల్ కళాశాలను మరో ప్రాంతానికి తరలించడానికి చేస్తున్న ప్రయత్నాలను వ్యతిరేకిస్తూ బీజేవైఎం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు మంజూరైన మెడికల్ కళాశాలను సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గం కేంద్రానికి తరలించే ప్రయత్నం చేస్తున్న జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు ఏమి పట్టనట్లు వ్యవహరించడం సరికాదన్నారు. గత ప్రభుత్వం జిల్లాకు కళాశాలను కేటాయిస్తే కాంగ్రెస్ ప్రభుత్వ తరలించడం ఎంత వరకు న్యాయంగా ఉంటుందని ప్రశ్నించారు. మా మెడికల్ కళాశాల మాకే కావాలనే నినాదంతో కళాశాలను తరిగి కాపాడుకుంటామని హెచ్చరించారు. మెడికల్ కళాశాలను తరలిస్తే ఆలేరు, భువనగిరి ఎమ్మెల్యేల ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కిసాన్‌మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్మోహన్‌రెడ్డి,కౌన్సిలర్ రత్నపురం బలరాం,బీజేవైఎం రాష్ట్ర, జిల్లా నాయకులు దిండు భాస్కర్, దయ్యాల కుమారస్వామి, మణికంఠ, రాజశేఖర్‌రెడ్డి,వాసం నర్సింగ్‌రావు,రమేష్, సదా ఆనందం, ఉమాశంకర్‌రావు, వైజయంతి, మల్లీకా, శ్యాంసుందర్, విజయకుమార్, శ్రీనివాస్, జనగాం నర్సింహా చారి, శ్రీనివాస్‌రెడ్డి, రత్నపురం శ్రీశైలం, భిక్షపతి, మల్లికార్జున్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

మేళ్లచెరువు : గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన గురువారం రాత్రి మేళ్లచెరువు మండలకేంద్రం శివారులో చోటుచేసుకుంది. మేళ్లచెరువు మండలంలోని వెల్లటూరు గ్రామానికి చెందిన సదరు వెంకటేశ్వర్లు (36) కల్లు గీత కార్మికుడు. రాత్రి కల్లు గీసుకొని మేళ్లచెరువు నుంచి ఇంటికి వెళుతుండగా కోదాడ –మేళ్లచెరువు రోడ్డులో వెనుకనుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని కోదాడకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య ,ఇద్దరు పిల్లలున్నారు. భార్య వెంకట్రావమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆటో, బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలు

మేళ్లచెరువు : ఆటో, బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన శుక్రవారం మేళ్లచెరువు మండలకేంద్రం పరిధిలో చోటు చేసుకుంది. హుజూర్‌నగర్ మండలం వేపలసింగారం నుంచి కూలీలను ఎక్కించుకొని వస్తుండగా మండంలోని కందిబండ గ్రామపంచాయతీ పరిధిలోని గాంధీనగర్ తండా గ్రామానికి చెందిన పాల్తీయా శ్రీను,పానుగోతు హేమ్లా వేపలమాధవరం గ్రామానికి బైక్ పై వెళ్లి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో మేళ్లచెరువు శివారులో ఎదురుగా వస్తున్న బైక్‌ను కూలీలతో వెళుతున్న ఆటో వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్ వస్తున్న ఇరువురికి స్వల్ప గాయాలయ్యాయి.

ఇనుపరాడ్లను విక్రయిస్తున్న ముగ్గురిపై కేసు

చౌటుప్పల్ : లారీలో ఇనుపరాడ్ల లోడ్ వేసుకొని గమ్యస్థానానికి చేరకముందే మార్గమధ్యలోనే డ్రైవర్ రాడ్లను విక్రయించే ప్రయత్నం చేయగా పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటన శుక్రవారం మండల పరిధిలోని పంతంగి టోల్‌ప్లాజా దాటాక రెడ్డిబావి గ్రామం వద్ద చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట మండలం సింగారం గ్రామానికి చెందిన గండికోట నరేష్ లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లోని ఏజాజ్‌నగర్‌లో బోడ శ్రీను అనే వ్యక్తి ఆదేశాల మేరకు ఇనుపరాడ్లను లోడ్ చేసుకున్నాడు. భద్రాద్రికొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం ముక్కామిడి గ్రామానికి వెళ్లేందుగాను వేబిల్లు తీసుకున్నాడు. ఆ క్రమంలో చౌటుప్పల్ మండల పరిధిలోని పంతంగి టోల్‌ప్లాజా దాటాక తనకు పరిచయస్తుడైన చిట్యాల మండల కేంద్రంలో వెల్డింగ్ దుకాణం నిర్వహించే చౌటుప్పల్ మండలంలోని రెడ్డిబావి గ్రామానికి చెందిన రేపాక యాదయ్య, అదే గ్రామానికి చెందిన వ్యవసాయదారుడైన పల్లె శేఖర్‌ల వద్ద లారీని ఆపాడు. వారితో బేరం కుదుర్చుకున్నాడు. అనంతరం లారీలోని ఇనుపరాడ్లను దింపాడు. అదే సమయంలో పెట్రోలింగ్ విధుల్లో ఉన్న పోలీసులు గమనించారు. దగ్గరకు వెళ్లి విషయాన్ని గుర్తించి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. విచారించగా లారీలోని టన్ను విలువగల రాడ్లను తీసినట్టుగా అంగీకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి

రాజాపేట : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందాడు. హైదరాబాద్‌లోని జగద్గిరిగుట్టకు చెందిన ఎడ్ల భూపాల్‌రెడ్డి (65) ఈనెల 2న జాల గ్రామంలోని బంధువ లక్ష్మారెడ్డి ఇంటికి వచ్చాడు. అదే రోజు బైక్‌పై వెళ్తూ కిందపడడంతో గాయాలయ్యాయి. ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందాడు.

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ భారతీయుడే కాదు

- మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్



మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ తదితరులు

చౌటుప్పల్ : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ భారతీయుడే కాదని మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ అన్నారు.మాజీ ప్రధానమంత్రి పీవీనరసింహారావుకు భారతరత్న పురస్కారాన్ని ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెంలో శుక్రవారం ప్రధాని మోదీ, పీవీనరసింహారావుల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అదే విధంగా కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాహుల్‌గాంధీ గతంలో కూడా మోదీ కులం విషయంలో ఇష్టానుసారంగా మాట్లాడారని ధ్వజమెత్తారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ 10–12 స్థానాలను కైవసం చేసుకుంటుందన్నారు. కేఆర్ఎంబీ విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలవి నాటకాలని విమర్శించారు. ఆరు గ్యారంటీలను తప్పించుకునే క్రమంలోనే కాంగ్రెస్ నేతలు చిల్లర రాజకీయాలకు తెరలేపారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా టెలికాం అడ్వయిజరీ బోర్డు సభ్యుడు రమనగోని శంకర్, కౌన్సిలర్ పోలోజు శ్రీధర్‌బాబు, నాయకులు గుజ్జుల సురేందర్‌రెడ్డి, ఆలె చిరంజీవి, పాలకూర్ల జంగయ్య, ఊడుగు యాదయ్య, దాసోజు భిక్షమాచారి, కంచర్ల గోవర్ధన్ రెడ్డి, కాసుల వెంకటేశం, పిల్ల బుచ్చయ్య, ఊదరి రంగయ్య, బండారు మహేందర్‌రెడ్డి, ఎర్ర గణేష్, పర్నె శ్రీనురెడ్డి, సప్పిడి లింగారెడ్డి, ఉప్కాగుల నాగరాజు, పర్నె శేఖర్‌రెడ్డి, లింగస్వామి, సందగళ్ల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

తూర్పు మాఢ వీధిలో కొబ్బరికాయ మొక్కులు

- అందుకు ఏర్పాట్లు చేస్తున్న ఆలయ అధికారులు
- ప్రస్తుతం విష్ణు పుష్కరిణి వద్ద కొబ్బరికాయలు కొడుతున్న భక్తులు



తూర్పు రాజగోపురం ముందు క్యూలైన్ వద్ద పరిశీలిస్తున్న అధికారులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తులకు సరైన సౌకర్యాలు కల్పించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కొండపైన శ్రీస్వామి వారి సన్నిధిలో భక్తులు మొక్కు కొబ్బరికాయలు కొట్టేందుకు వీలు కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా తూర్పు రాజగోపురం ముందున్న గోల్డెన్ క్యూలైన్ ప్రాంతాన్ని ఆలయాధికారులు శుక్రవారం పరిశీలించారు. ఆలయ అభివృద్ధి పనులు ప్రారంభంకాక ముందు తూర్పు రాజగోపురం నుంచి ఆలయంలోకి వెళ్లే వెండి ద్వారం సమీపంలో, ధ్వజస్తంభం ఎదుట భక్తులు కొబ్బరికాయలు కొట్టి మొక్కులను తీర్చుకునే వారు. ప్రధానాలయ పునర్నిర్మాణం పనులు ప్రారంభం అయ్యాక.. తాత్కాలికంగా బాలాలయాన్ని నిర్మించారు. ఈ బాలాలయంలో భక్తులు శ్రీస్వామిని దర్శించుకున్న తరువాత పడమటి దిశలో తమ మొక్కులో భాగంగా కొబ్బరికాయలను కొట్టారు. ఆలయ సన్నిధితో పాటు విష్ణు పుష్కరిణి సమీపంలో ఆంజనేయస్వామి ఆలయం ముందు, శివాలయంలో భక్తులు కొబ్బరికాయలు కొట్టే వారు.

ప్రధానాలయం ప్రారంభం అయ్యాక..

యాదాద్రీశుడి ప్రధానాలయంలో భక్తులకు దర్శనాలు పునఃప్రారంభం అయ్యాక భక్తులు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకునే సంప్రదాయాన్ని ఆలయ మాఢ వీధి, ఆలయం నుంచి దూరం చేశారు. శ్రీస్వామిని దర్శించుకున్న తరువాత భక్తులు విష్ణు పుష్కరిణి వద్ద ఏర్పాటు చేసిన స్థలంలోనే కొబ్బరికాయలు కొట్టేందుకు వీలు కల్పించారు. దీంతో భక్తుల మనోభావాలు దెబ్బతినడంతో పాటు మొక్కులు చెల్లించుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అంతే కాకుండా భక్తుల తమ వెంట తీసుకువచ్చిన కొబ్బరికాయలను ఆలయంలోకి తీసుకెళ్లకుండా తూర్పు ద్వారం ముందే పెట్టించారు. దీంతో భక్తులు అధికారుల తీరుపై తీవ్ర అభ్యంతరాలను వ్యక్తం చేశారు.

బ్రేక్ దర్శనం భక్తులు కొబ్బరికాయ ఎక్కడ కొట్టాలి..

శ్రీస్వామి వారిని సులువుగా దర్శించుకునేందుకు ఆలయాధికారులు ఉదయం, సాయంత్రం బ్రేక్ దర్శనాలు కల్పిస్తున్నారు. బ్రేక్ దర్శనానికి భక్తులు నేరుగా లిఫ్టు, ఆలయ ఉత్తర దిశలోని సీసీ ర్యాంప్ నుంచి వస్తారు. ఇక్కడి నుంచి వచ్చిన భక్తులకు తూర్పు రాజగోపురం ముందు గోల్డెన్ క్యూలైన్ లోకి వెళ్లి కొబ్బరికాయలు కొట్టేందుకు వీలు పడదు. దీంతో బ్రేక్ దర్శనం భక్తులకు ఇబ్బందులు ఎదురయ్యేలా ఉన్నాయి. అందరికి అందుబాటులో ఉండేలా ఉత్తర రాజగోపురం ముందు ఉన్న గ్రీనరీ ఏర్పాటు చేసిన ఖాళీ స్థలంలో కొబ్బరి కాయలు కొట్టేందుకు వీలు కల్పిస్తే బాగుంటుందని పలువురు భక్తులు అంటున్నారు.

తూర్పు రాజగోపురం ఎదుటే..

కొండపైన తూర్పు రాజగోపురం ముందు గల గోల్డెన్ క్యూలైన్‌లో భక్తులు తమ మొక్కు కొబ్బరికాయలు కొట్టేందుకు వీలు కల్పించనున్నారు. ధర్మ దర్శనం, రూ.150 టిక్కెట్ పై శ్రీస్వామిని దర్శించుకునే భక్తులు తూర్పు రాజగోపురం ముందు గల క్యూలైన్ లో కొబ్బరికాయలు కొట్టి శ్రీస్వామిని దర్శించుకోనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను త్వరలోనే పూర్తి చేయనున్నారు.